క్లుప్తంగా

అనంతుని కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


అనంతుని కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంబాబు, గిరిబాబు

పద్మనాభం: పద్మనాభంలో మార్చి 2 నుంచి 8 వరకు నిర్వహించనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆలయం వద్ద ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో ఎస్.నానాజీ బాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం, కోండ్రోతు శ్రీనివాసరావు, గాడు అప్పలరాజు, గేదెల చంద్రరావు, గంగిరెడ్ల పద్మనాభ స్వామి, కంటుబోతు ఎర్నాయుడు, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.

కాలువలో అక్రమంగా వేసిన పైపుల తొలగింపు


కాలువలో వేసిన పైపులను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస – అగ్రహారం పంచాయతీ బుడ్డివలసలో సర్వే నంబర్ 32/3లోని పోరంబోకు భూమిలో కృష్ణంరాజు చెరువుకు వెళ్లే కాలువలో అక్రమంగా వేసిన పైపులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, వీఆర్వో దొర బుధవారం పొక్లెయిన్‌తో తొలగింపజేశారు. బుడ్డివలస గ్రామానికి చెందిన బోని నారాయణ, సూర్యారావు, లక్ష్మణ, చిన్న కాలువలో ఈ నెల 12న అనుమతులు లేకుండా పైపులు వేశారు. ఈ పైపులను రెవెన్యూ సిబ్బంది పొక్లెయిన్‌తో తొలగించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు


ఆస్పత్రిలో గాయాలతో సూర్యప్రకాశరావు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ బంకు వద్దకు వేగంగా వచ్చిన కారు అక్కడ పని చేస్తున్న ముళ్లపూడి సూర్యప్రకాశరావు(62)ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులకు బంక్ నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆనందపురం : మండలంలోని తర్లువాడ వద్ద టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ శ్యామ్ సుందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మృతదేహం ఉన్నట్టు కొంత మంది స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్యామ్ సుందర్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడు నీలి రంగు టీషర్ట్, ఎరుపు రంగు డిజైన్ కలిగిన నిక్కరు వేసుకొని ఉన్నాడని, సుమారు 45 ఏళ్ల వయస్సు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 73822 96908 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్యామ్ సుందర్ కోరారు.

మైనర్ల బరితెగింపు.!


మైనర్లకు అడ్డాగా మారిన సంగివలస చెరువు వద్ద డీవీస్ పార్కు


చిట్టివలస జ్యూట్‌మిల్లు సమీపంలోని శిథిల ప్రదేశం

- దారితప్పి దోపిడీలు, దాడులు
- గంజాయి, ఇతర వ్యసనాలకు బానిసలై నేరాల బాట
- హడలిపోతున్న భీమిలి పట్టణ ప్రజలు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టివలస, తగరపువలస, సంగివలస డివిజన్లలోని పలు గ్రామాల్లో మైనర్లు బరితెగించి చిల్లర నేరాలకు పాల్పడుతున్నారు. దారికాచి దోచుకోవడం, ఆలయాలు, ఇళ్లలో దొంగతనాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల సరఫరా, సేవించడం వంటి చర్యలతో స్థానికులను భయకంపితులను చేస్తున్నారు. ఇటీవల వరుస నేరాలతో పోలీసులకు చిక్కుతున్నా పలుకుబడి ఉపయోగించి బయటపడుతున్నారు. వాస్తవానికి భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసిన 30.5 తులాల బంగారు ఆభరణాల చోరీ కేసులో 14 మంది మైనర్లు నిందితులు కాగా 11 మందిని పోలీసులే తప్పించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. 60 తులాల చోరీ సొత్తును వివిధ ప్రలోభాలకు తలొగ్గి సగానికి తగ్గించి చూపించినట్టు తెలిసింది. ఇందులో రూ.8.లక్షలు చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మైనర్ల ఆగడాలకు హద్దే లేదు

గత ఆరుమాసాల వ్యవధిలో ఈ ప్రాంతంలో జరిగిన నేరాలను పరిశీలిస్తే మైనర్ల ఆగడాలకు హద్దే లేదన్న విషయం స్పష్టమవుతోంది.

- బొగ్గురోడ్డు సచివాలయ పరిధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చిల్లపేటకు చెందిన వలంటీర్‌పై కొండపేటకు చెందిన ఇద్దరు మైనర్లు వంద రూపాయల కోసం దారి కాచి చాకుతో దాడి చేశారు.
- దీపావళి రోజున చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి వద్ద ఐటీఐ విద్యార్థి ఒకరిని తోటి స్నేహితులే గంజాయి మత్తులో కిడ్నాప్ చేసి తగరపువలస ఎల్లారమ్మ మెట్ట పరిసరాల్లో 24 గంటలు బంధించిన సంఘటన అప్పట్లో సంచలనం రేపింది.
- సంగివలస డీవీస్ పార్కు వద్ద సర్వీస్ రోడ్డులో రాత్రి 10 తర్వాత ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేవారిని అడ్డుకుని దేహశుద్ధి చేసి అందినకాడికి దోచుకుంటున్న సంఘటనలు కూడా జరిగాయి. అందులో భాగంగానే బంగ్లామెట్టకు చెందిన యువకుడు పెళ్లికి వెళ్లి వస్తుండగా దాడి చేసి మైనర్లు దోచుకున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల ప్రభావంతో తోటివారి పట్ల విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. వీరిలో ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులే అధికంగా ఉంటున్నారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో స్థావరాలు

ముఖ్యంగా విద్యార్థులే అధికంగా గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇందుగాను వీరు నిర్మానుష్య ప్రదేశాలను స్థావరాలుగా మలచుకుంటున్నారు. ముఖ్యంగా సంగివలస డీవీస్ పార్కు, చిల్లపేట – నమ్మివానిపేట గ్రామాల మధ్య అశోక్ లే అవుట్, చిట్టివలస జ్యూట్‌మిల్లు శిథిల ప్రాంతాలు, బొగ్గురోడ్డులోని చిట్టివలస – చిల్లపేట చెరువు గట్టు, చిట్టివలస సుఖీభవ లే అవుట్ పక్కన లెజెండ్ లే అవుట్, సంతపేట చిల్డ్రన్స్ పార్కు, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ పరిసరాలు, ఎల్లారమ్మ మెట్ట ప్రదేశాలు, గణేష్ థియేటర్ పరిసరాల్లోని వాణిజ్య సముదాయాల పైన, జ్యూట్ మిల్లు అవుట్ గేట్ వైపు పూనిగట్టు, గల్లీరోడ్డులోని ఎస్సీ కాలనీ వెనుక లే అవుట్, చిట్టివలస శ్మశాన వాటిక వెనుకభాగం, ప్రహరీలు, గేట్లు లేని ప్రభుత్వ పాఠశాలలను వీరు వినియోగించుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నరో తెలియకుండానే రోడ్లపై దాడులకు దిగుతున్నారు. అడ్డొచ్చిన వారిని చితకబాదుతూ, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మత్తుకు అలవాటుపడిన తమ పిల్లలను సకాలంలో తల్లిదండ్రులు గుర్తించకపోవడంతోనే చిల్లర నేరాలకు దిగి దొరికిపోతున్నారు. తర్వాత తమ పిల్లలు అలాంటి వారు కాదని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. దారి తప్పిన మైనర్లను సక్రమ మార్గంలో పెట్టేందుకు విరివిగా కౌన్సెలింగ్ నిర్వహించడంతోపాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచాలని భీమిలి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ


విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దాతలు

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 865 మంది విద్యార్థులకు మార్చి 31 వరకు సాయంత్రం వేళ అల్పాహారం పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమయింది. కొమ్మాదికి చెందిన విజ్జీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలశిల విజయమోహన్, విజయలక్ష్మి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు రూ.3 లక్షలు ఖర్చు చేయనున్నారు. మొదటిరోజు అల్పాహారం కింద సమోసా, అరటికాయ బజ్జీ అందించారు. కార్యక్రమంలో దాతలతోపాటు ప్రధానోపాధ్యాయులు రాజబాబు, జయప్రద, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా, పిల్లా సూరిబాబు, ఫౌండేషన్ మేనేజర్ ఉప్పరయ్య, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు రాంబాబు,గిరిబాబు, లక్ష్మణరావు

పద్మనాభం: పద్మనాభంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల కార్యాలయాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ప్రారంభించారు. కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను నియమించారు. అనంతరం ఇక్కడి నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ నామినేషన్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో భీమునిపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, నాయకులు మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, సీర సూరప్పడు, పిన్నింటి సూర్యనారాయణ, కర్రి శ్రీను, తాలాడ నరిసింహనాయుడు పాల్గొన్నారు.

బీచ్‌లో ఫోన్ల చోరీ


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో రెండు ఫోన్లు చోరీకి గురయ్యాయి. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం ఇక్కడి బీచ్‌లో గడిపేందుకు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు యువతీ యువకులు చేరుకున్నారు. కాసేపు స్నేహితులతో సరదాగా గడిపి బీచ్‌లో స్నానాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న బ్యాగులు, సెల్ ఫోన్లను కాస్త దూరంలో పెట్టారు. వీరు స్నానాలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుల్లోని రెండు సెల్‌ఫోన్లతోపాటు రూ.3 వేల నగదు, ఏటీఎం కార్డులు తీసుకుని పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవం సందర్భంగా భైటో భజన చేస్తున్న బృంద సభ్యులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు జీరుపేట శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం చిల్లపేట, జీరుపేట, కొండపేట, సంతపేట గ్రామాలకు చెందిన సరగడ ఆదిమూర్తి, చిల్ల సూరిబాబు దాసుల బృందాలు భైటో భజన నిర్వహించారు. సీతారాములను కీర్తిస్తూ పాటలు పాడారు.

పాక్షికంగా కాలిపోయిన సచివాలయ తలుపు


సచివాలయ తలుపును పరిశీలిస్తున్న సిబ్బంది, పోలీస్

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీ గ్రామ సచివాలయం ప్రధాన తలుపును మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా కాల్చివేశారు. సచివాలయ సిబ్బంది బుధవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సచివాలయం లోపల కంప్యూటర్లు, ఫర్నీచర్, పత్రాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కావాలనే ఎవరో ఆకతాయిలు ఈ తలుపును తగలబెట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు. సీసీ కెమెరాల్లో లభ్యమైన ఫుటేజీ ఆధారంగా భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించకుంటే కేసులు

పీఎం పాలెం: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాలని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.సాయి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనానికి ముందూ వెనుకా స్పష్టంగా కనిపించేలా నంబరు ప్లేట్లు ఉండాలన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఉంటే ప్రయాణికులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా సర్వీసు రోడ్డులో వాహనాలు నిలిపితే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కారుషెడ్, కొమ్మాది, క్రికెట్ స్టేడియం, మారికవలస కూడళ్ల వద్ద వాహనాలు వేగ నియంత్రణ నిబంధనలకు మేరకు ప్రయాణించాలని ఆయన సూచించారు.

గీతం వర్సిటీలో ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ ఫెయిర్


ట్రేడ్ కమిషనర్ మోనిక కెనడీని సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

కొమ్మాది: ఆస్ట్రేలియాలోని విద్యా సంస్థల్లో గల ఉన్నత విద్యావకాశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఆస్ట్రేలియా ట్రేడ్ పెట్టుబడుల కమిషనర్ మోనిక కెనడీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య మెరుగైన వాణిజ్య సంబంధాలున్నాయని, తమ దేశంలోని విశ్వవిద్యాలయాల్లో భారత విద్యార్థులకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గీతం కెరీర్ సర్వీసెస్ అసోసియేట్ డీన్ కమాండర్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు

పీఎం పాలెం: స్థానిక ఆర్‌హెచ్ కాలనీలో పూర్తి స్థాయిలో వీధి లైట్లు వెలగడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎం పాలెం రెండు, మూడు బస్టాపులలో దిగి కాలనీకి వెళ్లే ప్రయాణికులు వీధి దీపాలు అరకొరగా ఉండడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. మహిళలు తమ నివాసాలకు బిక్కుబిక్కుమంటూ చేరుకుంటున్నారు. కాలనీ నుంచి పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు సమీపంలో గల పద్మసాయి ఆలయానికి వెళ్లే రోడ్డులో చీకటి పడితే అంధకారం రాజ్యమేలుతోంది. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి కాలనీలో వీధి దీపాలు పునరుద్ధరించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ సమస్యకు చెక్


కొత్తగా వేసిన విద్యుత్ స్తంభానికి వైర్లు బిగిస్తున్న సిబ్బంది

పద్మనాభం: భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని రేవిడి, రౌతులపాలెం గ్రామాల్లో ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు సమస్యలు పరిష్కరించారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల్లో విద్యుత్ లైనులో పాడైన, పొట్టి స్తంభాలు ఉండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. దీంతో రూ.12 లక్షలు వెచ్చించి వీటి స్థానంలో కొత్తగా 17 స్తంభాలు వేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్తగా దిమ్మ కట్టారు. ఏఈ జగన్మోహనరావు పర్యవేక్షణలో ఈ పనులను పూర్తి చేశారు.

డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక పరిష్కారం


కాలువలోని మురుగునీరు పోవడానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పరిశీలిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని కొంకివీధి వద్దనున్న డ్రైనేజీ సమస్య బుధవారం తాత్కాలికంగా పరిష్కారమైంది. ఈ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో నీరు ఇరువైపులా నిలిచిపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనివల్ల దోమలు పెరిగిపోవడంతోపాటు అంటు వ్యాధులు వ్యాపిస్తుండడంతో ఈ ప్రాంతీయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ గతంలో అధికారులు సరిగ్గా పట్టించుకోలేదు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా నిలిచిపోయిన మురుగునీటిని బయటకు పంపడానికి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన పైప్ ద్వారా నీరు నిలిచిపోకుండా దగ్గరలోని కాలువలోకి వెళ్లిపోతుందని తెలిపారు. దీంతో ఇక సమస్య ఉండదని, ప్రస్తుతం పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో కొత్త కాలువల నిర్మాణం జరుగుతోందని, అందులో భాగంగా త్వరలో ఇక్కడ శాశ్వతంగా కాలువ నిర్మిస్తామని తెలిపారు. చాలా కాలంగా ఉన్న ఈ పెద్ద సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు జెడ్సీ రాముకి కృతజ్ఞతలు తెలిపారు. పారిశుధ్య విభాగం అధికారి బి.మహాలక్ష్మినాయుడు, పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్ పాల్గొన్నారు.

పాడి రైతుల ఆదాయం పెంపునకు కృషి


మాట్లాడుతున్న స్నైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ : పాడి పశువుల ఉత్పాదకత పెంపుదలకు కృషి జరుగుతోందని రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ (స్నైల్) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాండ్రపు సింహాచలం తెలిపారు. విమ్స్ సమీపంలోని రాష్ట్ర స్నైల్ కార్యాలయంలో అన్ని జిల్లాలలో ఉన్న వెటర్నర్ అసిస్టెంట్ సర్జన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో రోజుకు 35 నుంచి 40 మంది వరకు పశు వైద్యులకు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చారు. పాడి పశువులకు ఆధునిక పోషణ పద్ధతులు, వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంచడం, పాడి రైతులకు ఆదాయం పెంచే చర్యలు తదితర అంశాలను అధికారులు వివరించారు. దీంతో పాటు పశు వైద్యులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్నైల్ అదనపు డైరెక్టర్ సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు ఇక్కడ 1,117 మంది పశు వైద్యులకు, 80 మంది సన్న జీవాల వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శిక్షణ కేంద్రాలలో వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో తెలుసుకొన్న అంశాలు, ఆధునిక పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకోవడానికి, డెయిరీలలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పాల ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు ప్రోటీన్‌లతో కూడిన దానా అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, చలపతిరావు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం ఏర్పాటుకు చర్యలు


కొత్తగా ఏర్పాటు చేసిన దిమ్మపై ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద రోడ్డుకు ఆనుకుని ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు నెలల క్రితం వచ్చిన తుపాను ప్రభావం వల్ల విగ్రహం ఉన్న దిమ్మ కింద గట్టు కోతకు గురవడంతో అది బీచ్ ఇసుకలోకి జారిపడిపోయింది. అది చాలా బరువుగా ఉండడంతో పైకి తీయడానికి వీలుపడలేదు. ఇప్పుడు భారీ క్రేన్ సాయంతో విగ్రహాన్ని పైకి లాగి కొత్తగా పటిష్టమైన దిమ్మ ఏర్పాటు చేసి దానిపై విగ్రహాన్ని ఉంచారు. ఇంకా దీనికి సంబంధించిన కొన్ని పనులను పూర్తి చేసి, రంగులు వేయనున్నారు. ఎంతో ఆకర్షణీయంగా ఉండే విగ్రహం కొద్ది నెలలు లేకపోవడం వెలితిగా ఉండగా త్వరలో మళ్లీ సందర్శకులకు అందుబాటులోకి రానుంది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని రెండు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక సబ్ స్టేషన్ ఏఈఈ ఎ.సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆనందపురం, వేములవలస గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గృహ, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు ఈ విషయమై తమకు సహకరించాలని ఏఈఈ సురేష్ కుమార్ కోరారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ ఐటీ హిల్ నంబర్ ఒన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అయోధ్యనగర్, ఆర్‌టీసీ కాలనీ, మానం ఆంజనేయులు కాలనీ, సాక్షి ప్రెస్ ఏరియా, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని రామమూర్తి కోరారు.

చదువుపై శ్రద్ధ అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కొమ్మాది: ప్రస్తుతం అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. బుధవారం ఆమె జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం నాడు – నేడు పనుల పురోగతిపై సమీక్షించారు.